# ఎయిడ్స్ - విక్టిమ్

నారాయణ ఒక కాంట్రాక్టర్. ఆయన బంగారు కొడుకు పేరు సుధాకర్. సుధామయి, సుధారాణి, సుహాసిని అనే ముగ్గురు ఆడపిల్లల అనంతరం నారాయణ సౌదామినీ దంపతులకు మనసును చల్లన చేస్తూ సుధాకరుడు భూజాతుడయ్యాడు. బోలెడంత డబ్బు, అనేక సుఖ సౌకర్యాలు ఉన్న నారాయణకు అప్పటివరకు ఉన్న కొరత కొడుకు లేడన్నదే. అదీ తీరిపోయింది.

ఆ బిడ్డ సుధాకర్ రావడంతో ఆ ఇంట్లో ఆనందం అలలై పొంగింది. నామకరణం వంటి కారణాలేవో చూపించి ఆయింట ప్రతిరోజూ పండగ జరిగేది. ఆ ముగ్గురు 'సు' సోదరీమణులకు ఆ 'సు' సోదరుడంటే... ఆ బుజ్జిబాబు అంటే ఆ చిన్న కన్నయ్య అంటే ప్రాణం. వాళ్ళందరూ కలిసి ఆ అబ్బాయిని నేలమీద పెట్టకుండ పెంచారు. ఆ పిల్లవాడు బాగా ఆరోగ్యంగా పెరిగాడు. అతనికి లభించే పోషణ వస్తువులలో అతి సమృద్ధిగా ఉండేది వాత్సల్యమే.

చదువులో అతిసమర్థుడైన సుధాకర్ గణనీయంగా ఇంజనీరింగ్ పాసయ్యాడు. పై చదువులకోసం అమెరికా వెళ్ళాలని అతనికి కోరిక ఉండేది. కనువిందుగా పెరిగిన పిల్లవాణ్ణి సౌదామిని ఒక్కరోజు కూడా చూడకుండ ఉండలేకపోయేది. ఇక దూరదేశాలకు పోయి ఒంటరిగా కష్టపడవద్దని దీనంగా చెప్పడమేకాక, ఆహారపానీయాలు త్యజించి దివారాత్రాలు కన్నీరు కార్చింది. సుధామయి, సుధారాణి తల్లి తరఫున వాదిస్తే సుహాసిని మాత్రం తమ్ముడి పక్షం వహించింది. ఆ ముగ్గురి అక్కల భర్తలు విదేశాలకుపోయి పై చదువులు చదవడమే అభిలషణీయం అని అభిప్రాయ పడ్డారు. ఒక పెద్ద కార్యాసిద్ధికోసం కొద్దికాలం అతడు విదూరవాసం చేయడంలో తప్పు లేదని నారాయణ సౌదామినికి నచ్చచెప్పాడు.

''అక్కల పిల్లలతో ఆడుతూ పాడుతూ కొంతకాలం హాయిగా గడపకూడదా? రెండు మూడు సంవత్సరాల తరవాత తిరిగి వస్తాను కదా! అప్పుడప్పుడు సెలవు దొరికితే వస్తాను కదా! కావాలంటే సంవత్సరానికి ఒకసారి అమ్మ, నాన్న అమెరికా రాకూడదా? లోకమంతా తిరిగి చూడవచ్చు కదా!'' అని ఒక వంద రకాలుగా నచ్చజెప్పిన పిమ్మట ఆమె అతికష్టం మీద అంగీకరించింది.

అందగాడు, సమర్థుడు అయినా అతనిలో అమాయకత్వం ఉండడం వల్ల ఏ తెల్ల దొరసానయినా అతనిని వలలో వేసుకుంటుందా? అని సౌదామినికి భయంగా ఉండేది. అలాంటిదేమీ జరగదని సుధాకర్ ఆమెకు బలంగా హామీ ఇచ్చాడు. అబ్బాయికి సాయంగా ఒకరో ఇద్దరో పని మనుషులు వెళ్ళాలని సౌదామిని పట్టుబడుతుంటే ''వెర్రిదానా! మన అబ్బాయి వెళ్ళేది మద్రాసుకా? బొంబాయికా? ఎవరయినా అమెరికా వెళ్ళాలంటే పాస్‌పోర్ట్ ఉండాలి, వీసా ఉండాలి. సరయిన కారణం చూపిస్తేనే వీసా వస్తుంది. అమెరికాలో ఇక్కడ ఉన్నట్లు పనిమనుషుల్ని పెట్టుకోడానికి వీల్లేదు. ఒక్కొక్క పని చేయడానికి ఒక్కొక్క మెషీన్ ఉంటుంది. పెద్ద డబ్బు ఉన్నవాళ్లు ఒక డ్రైవర్‌ను గాని, పని మనిషినిగాని పెట్టుకుంటే వాళ్ళు పనికి వచ్చేదికూడా సొంతకారులోనే. అక్కడ ఇంటి పనులన్నీ అందరూ స్వయంగా చేసుకోవా ల్సిందే...'' అని నారాయణ తన లోకపరిజ్ఞానాన్ని నమూనాగా కొంచెం తన వామభాగ సమక్షే ప్రదర్శయేత్.

''అయ్యో! నా బిడ్డకు ఆ పనులేవీ రావే! అక్కడికి వెళ్ళి ఎంత ఇబ్బంది పడిపోతాడో...'' అని మాతృ హృదయం బాధపడింది.

''ఫరవాలేదు సౌదామినీ! కొద్ది కాలంలో అతను ఎడ్జస్ట్ అయిపోతాడు. రెండు సంవత్సరాల తర్వాత అతను చాలా సమర్థుడుగా తిరిగి వస్తాడు. ఇక్కడ ఏ చదువు చదివినా 'కూపస్థమండూకం'లాగానే ఉండిపోతాడు. ఇతను వెళ్ళి బాహ్య లోకమంతా చూడడమే మంచిది. విదేశీయుల జీవనశైలి కూడ తెలుసుకుంటాడు.''

ఆ రకంగా సుధాకర్‌కు రెక్కలు మొలిచాయి. గగన మార్గంలో పయనించి ఆయన సముద్రాన్ని దాటాడు.

నెలకు రెండు ఉత్తరాలు ఇంటికి రాసేవాడు సుధాకర్. అయితే ఫోన్‌లో మాట్లా డ౯ం లేదా? ఎందుకు లేదండీ! అతను వారానికి ఒకసారి మాట్లాడేవాడు.

మాసాలు గడిచాయి. రెండు సంవత్సరాలయేటప్పటికి ఆయన యం.యస్ పూర్తి చేశాడు. అయితే ఈ లోపల అతను ఒక్కసారయినా సెలవులో రావడంగాని ఆ తల్లిదండ్రులు అమెరికా సందర్శనం చేయడంగాని జరగలేదు. యం.యస్ అయ్యాక తిరిగివస్తానన్న సుధకు పిహెచ్‌డి. కూడా చెయ్యాలనిపించింది. సౌదామిని తన రోజూ కార్యక్రమం మళ్ళీ మొదలు పెట్టింది. నారాయణ ఫోను ద్వారా, ఉత్తరాల ద్వారా రమ్మని కోరాడు. కానీ సుధ అంగీకరించలేదు. సౌదామినికి నిద్ర కరువయింది. అబ్బాయిని ఏదయినా తెల్లదయ్యం మింగేసిందేమో అన్న పీడకలలు ఆమె మనసును కలత పెట్టాయి. అలాంటి గ్రహాలేవీ పట్టలేదని, పట్టబోవని ఆ యువకుడు ఉపగ్రహం

ద్వారా సంకేతం పంపడమేకాక, లిఖిత రూపంగా కూడా హామీ ఇయ్యడం జరిగింది.

అయితే ఒకరోజు సుధకు ఒక కేబుల్ వచ్చింది.

''మదర్ సీరియస్ లీ ఇల్ స్టార్ట్ ఇమ్మీడియట్లీ'' అని ఆ సందేశ సారం. ఉలిక్కిపడిన సుధాకర్ వెంటనే తండ్రితో మాట్లాడాడు. భయపడడానికేం లేదు, కొంచెం హార్ట్‌ప్రాబ్లం. వెంటనే కొడుకు వచ్చి తల్లిని చూడడం మంచిదని డాక్టర్ అభిప్రాయపడ్డాడు అని నారాయణ సుధాకర్‌తో చెప్పాడు.

తరవాత 48 గంటలలో సుధాకర్ హాజర్.

తల్లి పడకమీదనే ఉంది. చాలాకాలం తరవాత బిడ్డను చూడడం వల్ల అతిశయించిన సంతోషంతో అతనిని గట్టిగా కావలించుకుని వెక్కి వెక్కి ఏడ్చింది. అక్కడ అందరికీ డాక్టర్‌తో సహా చెప్పి ఉండడం వల్ల ఆ తల్లి దొంగజబ్బు గురించి కొడుకుకు ఎలాంటి సందేహం రాలేదు.

ఈ లోపల మల్లిక అనే బి.యస్.సి అమ్మాయితో సుధాకర్‌కు వివాహం చేయాలని నారాయణ సౌదామినులు చూచి పెట్టారు. ఆమె ఒక చీఫ్ ఇంజనీర్ కూతురు. బాగా ఆస్తి, పలుకుబడి ఉన్న కుటుంబం వారిది. అమ్మాయి చాలా అందంగా ఉండడమే కాకుండా చాలా చురుకైనది కూడ. అయితే కొద్దిగా హై సొసైటీ టైప్. చూడగానే సుధాకర్‌కు నచ్చింది గాని తన చదువు పూర్తవకుండ వివాహం గురించి ఆలోచించడమే వీలుపడదని చెప్పాడు. కావాలంటే నిశ్చయ తాంబూలం పుచ్చుకోమనీ, కానీ పెళ్ళి మళ్ళీ తాను వచ్చినపుడు చేసుకొంటాననీ అతడు వాదించాడు. కానీ అసలు జరిగింది ఒక గొప్ప కళ్యాణ మహోత్సవం.

(కొన్ని సినీమాల్లో కొంత కథ జరిగాక టైటిల్స్ చూపిస్తారు. ముఖ్యమైన భాగం తరవాత చూపిస్తారు. ఇప్పటివరకు మీరు చదివిన భాగం టైటిల్స్‌కు ముందున్న కథ. ఇక మీదట వచ్చేది టైటిల్స్‌కు ఉత్తర భాగమయిన ముఖ్య భాగం).

పెళ్ళి పూర్తి ఇష్టంమీద జరగకపోయినా మొదటిరాత్రిలోకి అడుగుపెట్టడం పూర్తి మనసుతో కాదని నిశ్చయంగా చెప్పడానికి అతినికే గుండెబలం ఉన్నట్లు కనబడడం లేదు. ఈ కథను ఒక సినిమాగా తీస్తే దానిపేరు ఆడదాని గుండెబలం అని కావాలనుకొంటే పెట్టుకోవచ్చు. కానీ జరగబోయే పండుగ గురించి ముందుగానే అంచనా వేయడమెందుకు?

ప్రేక్షకులకు కూడ నవోల్లాసం కలిగించే తొలిరాత్రి. ప్రత్యేకంగా అలంకరించిన తన పడకగదిలో సుధ తన వధువు కోసం ఎదురు చూస్తున్నాడు. పెళ్ళి చూపునాడు

గాని, ఈరోజు ఉదయం జరిగిన వివాహ కార్యక్రమం తరవాత గాని ఆమెతో మాట్లాడడానికి అవకాశం దొరకలేదు. ఇప్పుడు ఆమెతో ప్రథమ రాత్రి గడపాలంటే తాను ఏమేం మాట్లాడాలి? తాను మాట్లాడేటప్పుడు ఆమెలో ఎలాంటి ప్రతిస్పందన కలుగుతుంది? అని ఎడతెగని, అంతుదొరకని ఆలోచనల్లో పడ్డాడు. అమ్మాయి భలే స్మార్ట్, కొంచెం బిడియం ఉన్న టైప్ అని అనిపించడం లేదు. కానీ కొంచెం ఎక్కువ సీరియస్‌గా ఉన్నట్లు కనిపిస్తుంది. దేవుడా! ఏం పరిచయంలేని ఒక ఫీల్డ్ ఇది. అమ్మాయితో ముందే కొంచెం మాట్లాడడం జరిగి ఉంటే తనకింత భయంగాని, సస్పెన్స్‌గాని ఉండేది కాదు. ఎలాంటి అమ్మాయో ఏమో!

తలుపు తెరుచుకుంటుంది. ఆమె చేతిలో ఒక పాలగ్లాసు ఉందా? ఛీ! ఛీ! అది పాత సినిమాల్లో సీను. పాలు, పండ్లు, మమ్మల్ని చల్లగా చేయడానికి కావలసిన మంచినీళ్ళు అన్నీ అడ్వాన్సుగానే రెడీగా పెట్టి ఉన్నాయి కదా! ఉత్తర భారత రీతి అయితే బాగుండేది. తలమీద నుంచి జారుతూ ముఖాన్ని కప్పుతున్న పైట... 'ఘూంఘట్' మెల్ల మెల్లగా పైకి తీస్తూ ఆ 'చాంద్‌సా ముఖ్‌డా' అని చెప్పే ముఖారవిందాన్ని ఇన్‌స్టాల్‌మెంట్స్‌గా చూడడంలో ఒక ప్రత్యేక కిక్కు ఉంటుందేమో.

అరె! ఈమె ముఖం కొద్దిగానైనా కిందికి వంచకుండా, ఝాన్సీరాణి తన దర్బారుకు వచ్చినట్లు నిస్సంకోచంగా వస్తున్నదే!

''హాయ్ సుధా! సారీ ఫర్ బీయింగ్ లేట్'' అని ఒక బాయ్ ఫ్రెండ్ తో మాట్లాడుతున్నట్లు చెప్పింది. ఆమెకు పెద్దగా తెలుగు వచ్చినట్లు లేదు. చదివింది ఎక్కువగా మద్రాసులో ఊటీలో కదా మరి. అందుకే మన హనీమూన్ గూడ ఇంగ్లీషు మీడియమ్‌లోనే జరుగుతుందేమో. ఫరవాలేదు... తనకు కూడ అదే ఎక్కువ సౌకర్యం కదా! అని సుధాకర్ ఆలోచిస్తుండగా బాత్రూం నుంచి పళ్ళు తోముకుని బట్టలు మార్చుకుని బైటికి వచ్చింది. ఆమె ఇప్పుడు నైటీస్ వేసుకుని కూడ మరి ఆలోపల చుడీదార్ వేయడం ఏంటి?

ఆమె వచ్చి మంచంమీద కూర్చుని సుధాకర్ చెయ్యి పట్టుకుని అతన్ని కూడ కూర్చో బెట్టింది. ఆమె తన చెయ్యి పట్టుకోగానే శరీరం మొత్తానికి విద్యుదాఘాతం సోకినట్లయింది. లేక దీనినేనా రోమాంచం అని చెప్పేది. ఇంక ఏం మాట్లాడాలి? ఏమీ తోచటంలేదు. తన నాలుక గొంతులోపలికి జారిపోయిందా? ఏమిటీ ఈ దాహం? ఎందుకీ చెమట? ఎయిర్ కండీషన్ పనిచేయడం లేదా?

ఈలోపల ఆమె ఇంగ్లీషు ధోరణి అతనిమీద వచ్చి పడడం మొదలయింది. చూడు సుధా! నీతో కొన్ని ముఖ్యమైన విషయాలు ఈ ప్రథమ రాత్రి ప్రారంభమయ్యేముందే చెప్పాలని అనుకున్నాను. మనం చదువుకున్న వాళ్ళం. మనం వట్టి పశువులం కాదు. పల్లెటూరి వాళ్ళం కాదు. అందుకే నేను చెప్పే విషయాలు విని నన్ను అపార్థం చేసుకోరని నేను నమ్ముతున్నాను.

మొదటి రాత్రి అంటే వరుడు వధువును బలాత్సంగం చేసే రాత్రి అని అనుకోవడం తప్పు. భర్త దేవుడని నమ్మాలని ఆ తొలిరాత్రిలోనే వధువు తన సిగ్గును అతనికి తాకట్టు పెట్టాలని అనుకోవడం రాక్షసత్వం లేక వట్టి అనాగరికత అవుతుంది. స్త్రీ పురుషుల మధ్య లైంగిక సంపర్కం ఏర్పడే ముందు వారిరువురు పరస్పరం తెలుసుకోవాలి కదా! దగ్గరికి రావాలికదా! మనసులు కలిసిన మనం తొలిరాత్రి అనే పాత కథను మరచిపోదాం. అంటే దాని సరయిన అర్థం ఏమిటి? అని తెలుసుకుందాం. మనిద్దరి మధ్యా పరిచయం ఏర్పడడానికి, అన్యోన్యత పెంపొందడానికి కొంతకాలం పడుతుంది. ఏమయినా నాకు సెక్స్‌కు అంత తొందరేం లేదు. మీకు కూడ కొంతకాలం వేచి ఉండే మర్యాద ఉందని నాకు పూర్తి నమ్మకం ఉంది.

ఈరోజు ఉయం నుంచి మనిద్దరికి ఒక్క నిమిషం కూడా విశ్రాంతి దొరకలేదు కదా! అందుకే మనం ఇక నిద్రపోదాం. ఇక మన పరిచయ కార్యక్రమమంతా రేపుదయం నుంచి మొదలుపెడదాం. గుడ్ నైట్... అని చెప్పి మంచంలో ఒక పక్క గోడకు అభిముఖంగా పడుకుని నిద్రపోయింది. తిరిగి గుడ్ నైట్ చెప్పటానికి సుధాకర్ జిహ్వ సహకరించలేదు. దీపాలు ఆర్పి ఒక బెడ్ లైట్ మాత్రం ఉంచి మంచానికి ఇవతల పక్క నిట్టూర్చి పడుకున్నాడు. అతని నష్తనాడులు కాదు సర్వనాడులూ నీరసించి పోయాయి. బెడ్ లైట్ మసక వెలుతురులో ముఖరహితమైన ఆమె వెనకభాగాన్ని వీక్షిస్తూ పడుకున్నాడు. ఉదయం లేవగానే ఆవు పృష్టభాగాన్ని చూడడం చాలా శుభశకునమని అంటారు.

''దేవుడా! నేనిలాగే ఆమె వెనకభాగాన్ని చూచుకుంటూ నిద్రపోయి, నిద్రలేచినపుడు కూడ అదే వెనక భాగాన్ని చూస్తూ లేవాలని నానొసట రాసి ఉందా?'' అని తనమీద తాను జాలిపడ్డాడు. నిద్రలో నయినా ఆమె ఒకసారి ఇటు తిరగకపోతుందా అని ఆశపడ్డాడు. కనీసం ఆ నిద్రాముద్రిత సౌందర్యాన్ని చూస్తూ నయినా నిద్రపోవచ్చు కదా అనికూడ ఆశపడ్డాడు. కానీ ఆమె ససేమిరా తిరగలేదు. అలా చూస్తూ పడుకుంటేనే అతని కళ్లు అలసిపోయాయి. నిట్టూర్పుల వెచ్చదనంలో... సొంత భార్యను మొదటిరాత్రి ఒకసారి ముట్టుకోవడానికి కూడ వీల్లేదు కదా అనే ఆశాభంగంతో అతను ఇంకో దేవిని ఆలింగనం చేశాడు... నిద్రాదేవిని.

తరవాత రోజు ఆమె అతనితో నవ్వుతూ ముచ్చటిస్తూ పగలంతా గడిపేసింది. ఇంట్లో తన అక్కలతోను, పిల్లలతోను, తల్లిదండ్రులతోను మిగిలిన అందరితోనూ చాలా కలుపుగోలుగా తిరిగింది. సాయంత్రం వారిరువురూ కారులో వాహ్యాళికి వెళ్ళారు. కారులో కూర్చుని నిన్న రాత్రి మీ శ్రేష్టమైన ప్రవర్తనకు చాలా థాంక్స్. మీరొక జంటిల్‌మన్ అని పూర్తిగా నిరూపించుకున్నారు. ఇంకా కొంతకాలం ఈ నిగ్రహశీలాన్ని మనం పాటించాలి. మీరిప్పటికీ ఒక విద్యార్థియే కదా! పెళ్ళి వల్ల మీ ఏకాగ్రచిత్తం పాడు కాకూడదు. అంటే మీ రిసెర్చి పూర్తయేవరకు మీరు బ్రహ్మచర్యం పాటించాలని కాదు నా అభిమతం. మనం కొన్ని రోజులు మిత్రులుగా ఉంటూ, తరవాత నేచురల్‌గా మనం దగ్గర అవుదాం. పశువులకు ఉన్నట్లు మనకు ప్రత్యేకమైన 'మేటింగ్ సీజన్' లేదు కదా''. అనే కాక ఇంకా చాలా హరికథల్ని ఆమె సుధాకర్‌కి ఇంగ్లీషులో వక్కాణించింది.

సుధాకర్ అప్పుడప్పుడూ తల ఊపడం, ఊ కొట్టడం మాత్రమే చేయగలిగాడు. అప్పుడు ఆమె ''ఏం సుధా! నేను చెప్పేది మీకు నచ్చడం లేదా? లేకపోతే మీరెందుకు ఏమీ మాట్లాడడం లేదు'' అని అడిగింది.

''కారు నడిపే సమయంలో నేనెక్కువ మాట్లాడను... అయినా మనం సంభాషించ డానికి మాత్రం అయితే మనకింకా చాలా సమయం ఉంటుంది కదా!'' అని ఏదో ఆలోచిస్తూ అంటున్నట్లుగా అన్నాడు.

అది ఆమెను ఎక్కడో కొద్దిగా తగిలిందనే అనుకోవాలి. ఎందుకంటే మరికొంత సేపు ఆమె గొంతు వినిపించలేదు.

ఒక ఎనిమిది - పదిరోజులు అలా గడిచాయి. ఆ నవదంపతులకు అమెరికా వెళ్ళే సమయం దగ్గరయింది. మల్లికకు అమెరికా వెళ్ళడానికి స్టూడెంట్ వీసా ఆ మధ్యనే లభించడంవల్ల ఆమెను వెంటనే తీసుకొని వెళ్ళడానికి సుధాకర్‌కు ఎలాంటి ఇబ్బందీ కలగలేదు.

ఎంత త్వరగా వీలయితే అంత తొందరగా తిరిగి రావాలని సౌదామిని కొడుకుని, కోడల్నీ కోరింది. వాళ్ళిరువురూ దానికి అంగీకరించారు.

పెళ్ళయి పన్నెండు రోజులు గడిచినా బ్రహ్మచర్యానికి భంగం కలగకుండ సుధాకర్ తన ధర్మపత్ని అనే పత్ని కాలేని 'ఆడ మాత్రం'తో ఎయిర్ ఇండియా విమానం ఎక్కాడు.

కెన్నడీ ఎయిర్‌పోర్ట్‌లో వాళ్ళకి స్వాగతం పలకడానికి థామస్ అబ్రహాం అనే ఒక యువకుడు వచ్చాడు. అతను తన బాల్య స్నేహితుడని తన భర్తకాని భర్తకు ఆమె

పరిచయం చేసింది. అతని రూపం, ప్రవర్తన అన్నీ సుధాకర్‌కు బాగా నచ్చాయి. చాలా స్నేహపూరిత స్వభావం.

మంచితనం నిండిన అతని మనస్సు నుంచి ఒక కాంతి కిరణం ఇక రాబోతోంది.

''మిస్టర్ సుధాకర్! మీకిప్పుడు బాచ్‌లర్ అకామిడేషన్ మాత్రమే కదా ఉంది? నాకు ఒక ఫామిలీకి కావలసిన అపార్ట్‌మెంట్ ఉంది. నా ఇంట్లో వేరెవరూ లేరు. అందుకే ప్రస్తుతానికి మా ఇంటికి పోదాం. మీరు సౌకర్యాలన్నీ సిద్ధం చేసుకున్నాక అక్కడికి వెళ్ళిపోవచ్చు. ఏంటి? నాసలహా పట్ల మీకేమయినా అభ్యంతరం ఉందా?'' అని ఆమంచి మిత్రుడు ఒక చిరునవ్వు కూడా కలిపి అడిగాడు.

''ఏయ్! అది మీకు ఇబ్బంది అవుతుంది. నా అపార్ట్‌మెంటు చిన్నదయినా మేం సర్దుకుంటాం. ఏమయినా సొంతయిల్లే కదా సౌకర్యం'' అని సుధాకర్ మల్లిక, అబ్రాహం ముఖాల్ని మార్చి మార్చి చూస్తూ ఆగి ఆగి అన్నాడు.

నిజానికి అతనిది చిన్న అపార్ట్‌మెంట్. అస్తవ్యస్తంగా అన్నీ పడేసి ఉంటాయి. దానిలోకి ఈ నవవధువుని ఎలా ప్రవేశపెట్టడమా అన్న సంకోచం అతని మనస్సుని వేధిస్తూనే ఉంది.

''నా ఇల్లు మీ ఇల్లు కాకూడదని ఉందా? నన్ను ఒక పరాయి మనిషిగా ఎందుకు చూడాలి? మీరు నన్ను చూచింది మొదటిసారే అయినా 'ప్రథమ దర్శనంలోనే ప్రేమ పుడుతుందన్నట్లు ఈ క్షణం నుంచి నన్ను ఆత్మీయుడుగా భావించండి. ఈ రోజునుంచి నేను మిమ్మల్ని సొంత సోదరుడనే అనుకుంటాను'' అని థామస్ ఎంతో ప్రేమతో చెప్పడంవల్ల సుధాకర్‌కు ఇంకేరకమయిన అభ్యంతరం చెప్పాలనిపించలేదు.

థామస్ అబ్రహాం అపార్ట్‌మెంట్ ఒకమాదిరి పెద్దదే అని చెప్పాలి. కారులో వస్తున్నప్పుడు అతని స్వదేశం, తల్లిదండ్రులు, సోదరులు, చదువు, ఉద్యోగాల గురించి అబ్రహాం సుధాకర్‌కు వివరించాడు. ప్రస్తుతం అతను ఒక ప్రైవేట్ కంపెనీలో కంప్యూటర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు.

ఇంటికి చేరేటప్పడికి రాత్రి ఎనిమిదన్నర అయింది. ''షల్ వియ్ హేవ్ ఎ డ్రింక్'' అని అడుగుతూ విస్కీ బాటిల్ చేతిలోకి తీసుకున్నాడు.

అప్పుడప్పుడూ తాగే అలవాటుండడం వల్ల థామస్ ఇచ్చిన గ్లాసును అందుకున్నాడు. కానీ అతనికి ఆశ్చర్యం కలిగించిన దృశ్యం ఇంకొకటి.

'ది లేడీ విత్ హేవ్ ఎ జిన్ అండ్ లైమ్' అని చెప్తూ అతనిచ్చిన పానీయాన్ని పుచ్చుకొని 'ఛీర్స్' అని చెప్తూ మల్లిక తాగడం మొదలుపెట్టింది. 'ఈమె ఇంత

ఫార్వర్డా! ఇదేం నాకు తెలియదే?' అని సుధాకర్ మనసులో అనుకున్నాడు.

రెండు మూడు గ్లాసులయింతర్వాత థామస్ అబ్రహాం మేమెప్పుడూ మీకు రుణపడే ఉంటాం' అని మొదలుపెట్టాడు.

''ఏవిటీ ఈ మేము'' అని సుధాకర్ ఆశ్చర్యపోతుంటే

''ఆగండి... ఆగండి... విషయాలన్నీ నేనే చెప్తాను...'' అని మల్లిక తన ఇంగ్లీషు ధోరణి ప్రారంభించింది.

''ముందు నేను మిమ్మల్ని మోసం చేశానని అనిపిస్తుంది. ఒక విషయం వాస్తవమే. నేను మిమ్మల్ని పావుగా వాడుకున్నాను. నా కార్యసిద్ధికి వేరే మార్గం లేకపోయింది. దానికి మీరు నన్ను క్షమించాలి''. ఆమె చెప్పింది తనకు సరిగా వినిపిస్తోందా? లేక ఆమె మతిమాలి మాట్లాడుతోందా? అని సుధాకర్‌కు అనుమానం వచ్చింది. ఇప్పటివరకు రెండు పెగ్గులే తాగాడు. మూడోది ఇంకా ఎదురుగా ఉంది. దాన్ని ఇంకా తాగలేదు. అందుకే తన తలకాయ సరిగానే ఉంది. అతని కళ్ళు ఇంక విప్పడానికి వీల్లేనంతగా తెరుచుకుని ఉన్నాయి. ఆమె సంభాషణ కొనసాగింది...

''కానీ పాతకాలం కథలో పులిగొంతులో ఇరుక్కున్న ఎముకను బైటికి తియ్యడానికి తల లోపలికి పెట్టిన కొంగకు ఏమీకానట్లే మీకు కూడా ఏం కాలేదని కథ పూర్తయ్యాక మీకు తెలుస్తుంది. అప్పుడు మీరు నాకు థాంక్స్ కూడా చెబుతారేమో. ఇక మీరు మా కథ వినండి.''

''మేము చిన్నప్పట్నుంచీ స్నేహితులం. నేనెక్కడ చదువుతున్నా అక్కడికి థామస్ వచ్చి నన్ను చూచేవాడు. మా మధ్యలో ఉన్న ప్రేమబంధం గట్టిపడుతూ వచ్చింది. థామస్ ఇంజనీరింగ్ పాసయ్యాక మేము లేచిపోయి పెళ్ళి చేసుకుందామని నిర్ణయించుకున్నాం. మా ప్రేమ ఉచ్ఛస్థితిలో ఉన్నపుడు లైంగిక సంపర్కం ఉండడం అనైతికంగా మేం భావించలేదు.''

సుధాకర్ చిట్లించిన కనుబొమ్మలతో అలాగే ఉండిపోయాడు. అతని హృదయం మీద సహస్ర బాణాలు దాడిచేస్తున్నట్లు అనిపించింది.

ఆమె మళ్ళీ చెప్పింది.

''మా రహస్య బంధం మా తల్లిదండ్రులు తెలుసుకున్నారు. నా తండ్రి ఎంత పెద్ద దూర్వాసుడో మీరు విని ఉంటారు. థామస్ తండ్రి కూడ తక్కువ వాడేం కాదు. నా తండ్రి ఈ సంబంధానికి ఒప్పుకున్నా కూడా థామస్ తండ్రి నేను మతం మారకుండ ఒప్పుకునేవాడు కాదు. నా తండ్రి వెళ్ళి థామస్ తండ్రిని బూతులు

తిట్టడం వల్ల స్వాభిమానం నిల్పుకోడానికి ఆయన ఒకే ఒక కొడుకుకు దేశాంతరవాన శిక్ష విధించి వెస్ట్ ఇండీస్‌కు పంపించాడు. అక్కడ్నుంచి థామస్ అమెరికాకు వచ్చి ఆరేడు నెలలే అయింది. ఈ విషయం నా తండ్రికి తెలియనే తెలియదు. ఈ మధ్య నేను అమెరికాకు పై చదువుకు రావాలని ప్రయత్నం చేస్తున్నప్పుడు - 'నీ మెడలో మూడు ముళ్ళు పడ్డాకే ఈ ఇంటినుంచి నీవు బైటికి వెళ్ళేది' అని నాతండ్రి గట్టిగా హెచ్చరించాడు. కానీ ఈ మధ్యకాలంలో థామస్ వెస్ట్ ఇండీస్ నుంచి మద్రాసు వచ్చినపుడు నాన్నగారిని మోసం చేసి ఇద్దరు మిత్రులతో వెళ్ళాను. అక్కడ రెండు రోజులు మేము భార్యభర్తలుగా గడపాం.

సుధాకర్ చేతిలోని విస్కీ గ్లాసును బలంగా నొక్కాడు. అలా నొక్కి దాన్ని పగలగొట్టాలనిపించింది. ''అమెరికా వచ్చాకనే ఆ బాంబు విషయం కనుక్కున్నాడు... మాతలలపైన విరిగిన ఆ బాంబు... మమ్మల్ని శవాలుగా మార్చిన ఆ బాంబ్... వెస్ట్ ఇండీస్‌కు కొత్తగా చేరినపుడు ఒకరోజు థామస్ అపరిచితులు ఎక్కువగా ఉన్న ఒక డ్రింకింగ్ పార్టీలో పడిపోయాడు. ఆ విందులో ఎక్కువమంది నీగ్రోలు. ఆ రాత్రి ఏమేం జరిగిందో థామస్‌కు తెలియదు. తెల్లవారి లేవగానే థామస్ శరీరంమీద ఒక్క గుడ్డ అయినా లేదు. శరీరమంతా నొప్పి. అదొక దుస్స్వప్నంలా మరచిపోయాడు. కానీ అమెరికాకు రాగానే టెస్ట్ చేసి చూస్తే... ఓ మైగాడ్ , అతనికి హెచ్.ఐ.వి పాజిటివ్ ఉన్నట్లు తెలిసింది. పాపం అది తెలియగానే తన జీవితం నాశనమయిందని కాదు అతను ఏడ్చింది... మద్రాసుకు వచ్చి నన్నుకూడ ఆ మారక రోగవస్త్రాన్ని విసిరేశాను కదా అపరాధ భావనతో అతను ఏడ్చాడు. థామస్ ఫోన్ ద్వారా విషయాలన్నీ తెల్పాడు. ఆరోజు మేము తీసుకున్న నిర్ణయం ఇది...

ఏదో ఒకరకంగా నేనిక్కడికి చేరాలి... ఉరి శిక్షకు రోజులు లెక్కపెట్టుకుంటూ కూర్చున్న ఇద్దరు నేరస్థులలాగా రోజులు గడపాలి. నాకారణంగా థామస్ వెస్ట్ఇండీస్‌కు పోవాల్సి వచ్చింది. థామస్ ద్వారా నాకీ మృత్యుదండన విధించడమయింది. మేము పరస్పరం క్షమించుకొని కలిసి ఆరోజు కోసం ఎదురు చూస్తుంటాం. ముందు ఎవరు వెళ్తారు అని చెప్పడానికి లేదు. కానీ ఎవరు ముందయినా ఆత్మహత్య చేసుకోవడమనేది మేమిరువురం ఒప్పుకోము. మా ఇద్దర్నీ ఆరోగం పూర్తిగా తినేశాక మేము పై లోకంలో ఒకటిగా కలుసుకుంటాం.

థామస్! ఆలోకంలో కూడా ఈరోగం ఉంటుందా? ఉంటే మీరు కనీసం, అక్కడయినా కొంచెం జాగ్రత్తగా ఉండాలి..

థామస్ మెల్లగా హస్త తాడనం చేశాడు...

''దట్ ఈజ్ ది స్పిరిట్... యు.ఆర్. ఎ బ్రేవ్ గర్ల్...'' అని పశ్చాత్తాపలేశ రహితంగా చెప్పాడు.

సుధాకర్‌లో ఏయే నమ్మిక వికారాలుత్పున్న మయ్యాయో అతనికే తెలియదు. కానీ మల్లిక ఆపలేదు.

''ఆ తరుణంలో దేవుడు పంపినట్లు మీరు వచ్చారు. మా కోరికను సఫలీకృతం చేయడానికి నన్ను ఈ ఒడ్డుకు చేర్చడానికి దేవుడు పంపిన ఓడ మీరు. మీరే నా పాస్‌పోర్ట్. మీరే నా అసలయిన వీసా.''

''ఏ అమ్మాయి అయినా చూడగానే వెంటపడే అందం మీది. ఏం జరిగినా మిమ్మల్ని మత్యుగహ్వారంలోకి పంపను అని నిర్ణయించుకున్నాను. మీరెప్పుడైనా నన్ను బలవంతం చేస్తారేమోనని భయపడి నాదిండుకింద ఎప్పుడూ ఒక కత్తి ఉంచుకొనేదాన్ని. మీరు ఏరోజయినా నన్ను తాకి ఉంటే మిమ్మల్ని గాయపరచి అయినా కాపాడి ఉండేదాన్ని. మీకెలాంటి అపాయం కలగకుండా ఇన్ని రోజులు మీతో ఉండి మిమ్మల్ని కాపాడడంలో విజయం సాధించాను. అందువల్ల నాకు చాలా సంతృప్తి కలిగింది. మల్లిక భాషణం ఆరకంగా కొంత ఆగిపోయింది.

''కానీ థామస్! చాలామంది సమక్షంలో మా పెళ్ళి జరిగింది. ఇన్ని రోజులు మేం కలిసి ఒకే మంచం మీద పడుకున్నాం. ఇన్ని రాత్రులలో ఏమయినా జరిగి ఉండవచ్చని అనుమానం లేదా? మల్లిక పట్ల మీకు అంత విశ్వాసమా? మీకు జరిగినట్లు ఏదయినా మత్తు మందిచ్చి నేను మల్లికను...'' అని అడుగుతున్న సుధాకర్‌కు ఆ ప్రశ్నను ఎలా పూర్తి చేయాలో అని అర్థం కాలేదు.

''మిస్టర్, సుధాకర్, యథార్థ ప్రేమకు సరియైన పునాది పరస్పర విశ్వాసం. ఆ విశ్వాసం - మల్లిక శక్తిసామర్థ్యాలపై నాకున్న నమ్మకం. విశ్వాసం అంటే ఎల్లప్పుడూ పరిపూర్ణంగా వుండాలి. నేను మనఃపూర్వకంగా ఏలాంటి తప్పు ఇంతవఱకు చేయ లేదు అనే ఒక నమ్మకం మల్లిక మనసులో వుంది. అంటే దానికి పరిపూర్ణ విశ్వాసం... అచంచల విశ్వాసం అనే కదా మనం చెప్పాల్సింది. ఆమె పెళ్ళి, ఒకవేళ ''ఈడీ అమీన్''తో జరిగివున్నా ఆమెను లొంగదీయడం అతనికికూడా సాధ్యమయ్యేది కాదు. కావలస్తే, ఆమె మెదడును మాత్రం రిఫ్రిజిరేటర్లో అతను వుంచుకోగలడు'' అభి థామస్ ధైర్యంగా చెప్పి ముగించగా మల్లిక చప్పట్లు కొట్టింది.

''థాంక్యూ మల్లికా! మీ ప్రేమ కథ విని నాకు చాలా బాధగా వుంది. కాని మీరిద్దరూ మీ లక్ష్యాన్ని చేరుకోవడంలో నాకు చాలా సంతోషంగా కూడా వుంది. కాని మల్లికను రక్తపరీక్ష ఇంతవఱకు చేయలేదు కదా! అది చేయకుండా ఆమెకు ఈ జబ్బు వచ్చిందని

ఎలా నిర్ణయిస్తారు?'' అని సుధాకర్ ఒక చిన్న పాయింట్ వాళ్లముందు వుంచాడు.

ఆమెకు అది రాకుండా వుండడం అసాధ్యం. ఈ జబ్బున్న వ్యక్తితో ఒక్కసారి కలిస్తే చాలు, ఈరోగం రావడానికి. రోగం నాకు వున్నట్టు తెలియకుండా రెండు రోజులలో మేము 'నిషిద్ధ ఫలాలు' తప్ప ఇంకేమీ తినలేదు; అని థామస్ చెప్పగా...

''డియర్ సుధా! మీరు ఒక నాగుపాము మెడలో తాళి కట్టారు. అది కనుక ఒకసారి కాటువేసి వుంటే మీకు ఏం జరిగి వుండేది?'' అని మల్లిక ప్రశ్నించింది. సుధాకర్ - థామస్ మధ్యలో నేత్ర సందేశాలు వినిమయం జరిగింది... మల్లికలో ఆ 'జిన్నన్‌లైన్' బాగా పనిచేస్తుందని.

''ఇంక నేనేం చేయాలి? ప్రస్తుతం నేను నా అపార్ట్‌మెంట్‌కు వెళుతున్నాను. నా భార్య ఇంకొకరితో శయనించడం చూస్తూ వుండడానికి గాని, వింటూ పడుకోడానికి గాని కావాల్సిన శక్తి, గుండెబలం నాకు లేవు'' అని సుధాకర్ చెప్పాడు.

''ఇంత రాత్రిలో ఒంటరిగా వెళతారా! వద్దు, వద్దు మేమూ వచ్చి వదలి పెడతాం'' అని థామస్ చెప్పాడు.

''అదేం అవసరం లేదు. ఒక క్యాబ్‌ను పిలిస్తే చాలు. భవిష్యత్కార్యక్రమలాలు మీరే నిర్ణయించుకోండి. విడాకుల కాగితాలు పంపిస్తే నేను సంతకం పెట్టి ఇస్తాను'' అని సుధాకర్ చెప్పాడు.

ట్యాక్సీ కారు వచ్చింది. గుడ్ నైట్స్ చెపుకొని వాళ్లు విడిపోయారు.

ఎక్కువ ఆలస్యం కాకుండా మల్లికకు వివాహమోచనం లభించింది. ఇప్పుడు ఆమెకు పెట్టిన కొత్తపేరు ''మిలీ థామస్''.

కాలచక్రం తిరగకుండా వూరికే కూర్చుంటుందా?

ఐదు సంవత్సరాలు దాటిన తర్వాత గూడా సుధాకర్ తలిదండ్రుల దగ్గరకు వెళ్లలేదు. ఏడ్వడం కన్నీరు కార్చడం అంతా దిన చర్యలుగా పెట్టుకున్నా కూడా, సౌదామినికి, ఇంకోసారి గుండెజబ్బు వచ్చినట్లుగా నటించడానికి గుండెధైర్యం సరిపోలేదు.

అమెరికాలో సుధాకర్ ఇప్పుడు ఒక ప్రైవేట్ కంపెనీలో ఇంజనీరుగా పనిచేస్తు న్నాడు. అదే ఆఫీసులో పని చేస్తున్న ''ఆనీ'' అనే ఒక అమెరికన్ అమ్మాయికి అతను కొంచెం దగ్గరయ్యాడు. ఒకరోజు తన వివాహం గురించి మరల తన డైవర్స్ గురించి అతను వివరంగా ఆమెకు చెప్పడం జరిగింది. రెండురోజుల తర్వాత ఒక

మెడికల్ సర్టిఫికెట్‌తో ఆనీ వచ్చి అది చూపించి ఆయనను అడిగింది. ''మిస్టర్ సుధాకర్, నాకు ఎయిడ్స్ లేదని చూపే సర్టిఫికెట్. ఇకనైనా నన్ను పెళ్లాడ్డానికి మీకు ధైర్యం వుందా?''

అబ్బాయి పెళ్లి చేసుకోబోతున్నాడని తెలుసుకొని నారాయణ్ - సౌదామిని దంపతులు తమ ప్రథమ అమెరికా యాత్ర సందర్శనంగా న్యూయార్క్ చేరారు. విమానాశ్రయానికి చీర కట్టుకొని వచ్చిన ఆనీ, వాళ్లకు ఆరాధనా భావంతో పాదనమస్కారం చేసేటప్పుడు, చెమ్మగిల్లిన ఆమె కళ్లు మరో పది నిముషాల వరకూ, కన్నీటిని వర్షించడానికి ఆమెకు అనుమతినిచ్చాయి.

ఆనీ - సుధాకర్‌ల వివాహాన్ని ఆపటం తల్లిదండ్రులకు సాధ్యం కాలేదు. కానీ, ఆ అమెరికా అమ్మాయిది ఎంత మంచిమనసో చూడండీ - సౌదామిని కోరిక మేరకు అమెరికా వదలి, భర్తతోపాటు భారతదేశంలో వుండడానకి ఆమె సిద్ధపడింది. ఇప్పుడు ఆమె పేరు అనూరాధ. అమెరికా వేషధారణ ఆమె పూర్తిగా మరచిపోయింది. ఇక్కడ, ఎప్పుడూ చీరనే ధరిస్తుంది. నిడుపాటి కేశాలను పెంచనారంభించింది. మొహాన బొట్టు లేకుండా ఆమెను చూడడం సాధ్యం కాదు. గుడికి వెళ్లటం కూడా, ఆమె దినచర్యలో ఒక భాగం. ఆమె పూర్తి శాఖాహారి. ఆమెకు ఆరు నెలల క్రిందట పుట్టిన అబ్బాయి పేరు ఏమిటో తెలుసా? లింకన్ అని కాదు, విల్సన్ అని కాదు, లివింగ్‌స్టన్ అని కానే కాదు. బాబుకు నామకరణం చేసిందీ ఆమే. ఆమె మనసుకు బాగా నచ్చిన పేరే పెట్టడం జరిగింది. ఆపేరు మరేం కాదు - 'రాధాకృష్ణ'.

అయితే మల్లికను కాదు కాదు మలీనీ థామస్ అబ్రహాంను, ఏ సమాధి స్థలంలో పాతిపెట్టారు?

మొదట వాళ్లు మరణిస్తే కదా, సమాధి చేయటమనే ప్రశ్న వుదయించేది? వాళ్లకు ప్రస్తుతం నాలుగేళ్ల అమ్మాయి, రెండున్నర సంవత్సరాల బాబు వున్నారు. పిల్లలిద్దర్నీ, ప్రయోజకుల్ని చేసింతర్వాత గదా వాళ్లు మరణించాలి. కాని ''ఏయిడ్స్ వైరస్'' అంతకాలం వరకు వేచి వుంటుందా? చేయదుగాక, చేయదు. మరి, ఈ ఇద్దరు పిల్లలకు, వాళ్లు ఎందుకు జన్మనిచ్చినట్లు? ఇదెంత మహాపరాధం!

ఇంత పెద్ద మహాపరాధం వాళ్ళు చేయనే చేయరు. గొప్ప దైవ భక్తుడైన థామస్ అబ్రహాం శరీరాన్ని ఆ వైరస్ ఎప్పుడూ సమీపంచలేదు. కఠినమైన ప్రేమ జాడ్యంతో సతమతమౌతూన్న ఆ యువజంట మనసులో - బుద్ధిలో లేక మస్తిష్కంలోనే ఆ అత్యాధునికమైన వైరస్ జనించింది.

ఆ రోగానికి ఒకే ఒక వ్యక్తి ''విక్టిమ్'' అయినాడు. అతనే పాపం - ఆ సుధాకర్.